# త్రైలోక్యగీత
# సప్తదశాధ్యాయము
# యోగమార్గ జ్ఞాన యోగము

**త్రైలోక్యా ఉవాచ:-**
**దత్తాత్రేయ విభో! వేద-క్షీరసాగర మందర! |**
**పాపినాస్తికతో యోగం, బ్రూహి సర్వం భువం గత! || 17.1||**

[**కుమారి త్రైలోక్య అడిగింది:-** ఓ దత్తాత్రేయ భగవానుడా! వేదమనెడి పాలసముద్రమును చిలికి దివ్యమైన అమృతమును వంటి ఆధ్యాత్మిక జ్ఞానసారమును ఇచ్చిన మందర పర్వతము తమరు! దానిని పంచడానికే మీరు భూమి పై అవతరించినారు. ఒక పాపి అయిన నాస్తికుడు ఉత్కృష్ట లక్ష్యమైన భగవంతుడిని చేరగలిగే యోగమార్గమును దయచేసి తెలుపగలరు.]

**శ్రీ దత్తస్వామీ ఉవాచ:-**
**త్రైలోక్యే! కర్మయోగస్థే! జ్ఞాన భక్తి సముద్గతే! |**
**యోగమార్గ స్సమేషాం హి, సర్ప నిశ్రేణికా పటః ||17.2||**

[**శ్రీశ్రీశ్రీ దత్తస్వామి వచించారు:-** ఓ త్రైలోక్య! నీవు మొదటి రెండు స్థాయిలైన ఆధ్యాత్మిక జ్ఞానము(జ్ఞాన యోగము) మరియు భక్తి (భక్తి యోగము)లను గత జన్మలోనే దాటి ఈ వర్తమాన జన్మలో నీవు చివరి స్థాయి అయిన సాధన (కర్మయోగము)లో నున్నావు. నీవు సత్యమైన ఆధ్యాత్మిక జ్ఞాన ప్రచారము చేయగలదానవు. ఈ సృష్టిలోని మానవ జీవాత్మలందరికీ యోగమార్గము అనుకూలమైనది, ఇది **'పరమ పద సోపాన పటము'** వంటి ఆటపటచిత్రము వంటిది. ఈ చిత్రములో చిన్నవి, పెద్దవి అయిన నిచ్చెనలు మరియు పాములు అనునవి జీవాత్మలు చేసుకున్న చిన్నవి, పెద్దవి అయిన పుణ్యపాపములకు ప్రతీకలు. భగవద్బంధమే నిచ్చెన, సంసారబంధమే పాము. చిన్నవి అనగా బలహీనములు, పెద్దవి అనగా బలమైనవి. ఒకవేళ చిన్నవి, పెద్దవి

అయిన నిచ్చెనల అడుగున ఉండే గడిలోకి పావు వస్తే చిన్నవి, పెద్దవి అయిన ఎత్తులలోకి పావు ఎక్కుతుంది. ఒకవేళ పావు చిన్నవి, పెద్దవి అయిన పాముల నోరు ఉండే గడిలోకి వస్తే పాముతోక గల చిన్నవి, పెద్దవి అయిన గడుల లోకి క్రిందికి పావు పడిపోతుంది. జీవాత్మ చేసుకున్న పుణ్యకర్మల ద్వారా ఉత్థాన పురోగతిని పొందును, మరియు పాపకర్మల ద్వారా అదే జీవాత్మ అథోగతికి చేరును అనేది ఎంత సహజమో, అంతే సహజముగా పాపి అయిన నాస్తికుని స్థాయి నుండి ఆధ్యాత్మిక ప్రయాణము ఆరంభించిన జీవాత్మను ఆధ్యాత్మిక మార్గము చివర ఉన్న ఉత్కృష్టమైన పరమాత్మను చేర్చగలదు.]

**ద్రైవాభావే రాజదండ-వ్యత్యయే తర్క్యతా మఘమ్ |**
**విజ్ఞా న్యాయ క్రమా మూఢౌ, ఉత్తమాధమ నాస్తికౌ || 17.3||**

[అందరు నాస్తికులు పాపులే అని మనము చెప్పలేము, కాని నాస్తికులకు పాపము చేయగల సంభావ్యత చాలా ఎక్కువగా ఉన్నది అని తప్పక చెప్పగలము, కాకపోతే పాపకర్మలను రహస్యముగా చేయవచ్చును లేదా బహిరంగముగా చేయవచ్చును. ఎందుకంటే శిక్షించగల భగవంతుడు లేడు, ఒకవేళ భూమి పైన నేరములకు శిక్షలు అమలు చేసే ప్రభుత్వము నుండి అధర్మ మార్గములో, అవినీతి ద్వారా తప్పించుకో గలిగితే, పాపము చేయడము తర్కసంగతమే అవుతుంది. ఉత్తములు మరియు అధములు అని పాపులైన నాస్తికులలో రెండు రకాలు ఉంటారు. శాస్త్రవేత్త ఉత్తముడైన నాస్తికుడు. శాస్త్రము ఎప్పుడైనా ఏ మూల్యము వద్దనైనా సత్యవిషయములను నిరాకరించదు, ఒకవేళ ఆ సత్యవిషయము యొక్క నేపథ్యమును వివరించలేకపోవచ్చును కాని, దానిని నిరాకరించదు. ఊహింప శక్యము కాని ఒక సంఘటన గురించి వివరించవలసివస్తే, ఒక శాస్త్రవేత్త మౌనంగా ఉంటాడు, ఇటువంటి సంఘటననే అద్భుతమైన మహిమ అంటారు. యథార్థమైన మహిమలను చూసి ఆస్తికుడు కూడా మౌనం గానే ఉంటాడు. అద్భుతమైన మహిమ

కనబడుతుంది, కాని దానికి కారణభూతమైన నేపథ్యము మరియు యంత్రాంగము మాత్రము ఊహింప లేనిది. ఒక శాస్త్రవేత్త ఎల్లప్పుడు క్రమబద్ధమైన తర్కమును అనుసరిస్తాడు, కాబట్టి మహిమలు అనూహ్యమైనవి అని నిర్ద్వంద్వంగా చెప్పగలము. దీని అర్థము, మహిమలకు మూలకారణము అనూహ్యమైన దైవము అని. అనూహ్యమైన మహిమలను చూసి అనూహ్యమైన భగవంతుడు ఉన్నాడని శాస్త్రవేత్త అంగీకరిస్తాడు. అథముడైన నాస్తికుడు తర్కము కాని, శాస్త్రీయత కాని లేకుండా మూఢుని వలె అనూహ్యమైన పరమాత్మ యొక్క ఉనికిని నిరాకరిస్తాడు, శాశ్వతముగా తన నాస్తిక స్థానములోనే స్థిరముగా నిలబడతాడు.]

**నోహ్య ప్రత్యక్ష తర్కాభ్యాం, ఆద్యో రూఢః పరః స్థిరః |**
**తద్విమర్శై ర్దోష హానిః, ఇంద్రజాలం చ విద్యతే || 17.4||**

[ఉత్తముడైన నాస్తికుడు యోగమార్గములో ఉన్నవాడు. ఎందుకంటే తాను చూసిన దృష్టాంతమును అంగీకరించి తర్కబద్ధమైన ముగింపుకు వస్తాడు. కాని రెండవ వాడైన అధమ నాస్తికుడు తన స్థానములోనే స్థిరముగా ఉన్నందున యోగమార్గములోకి రాలేడు, ఎందుకంటే అతడు ప్రయాణమును ఆరంభించనే లేదు. విజ్ఞాన శాస్త్రవేత్తలను మరియు ఉత్తమ నాస్తికులను (నాస్తికులయ్యును ధర్మ బద్ధముగా జీవించువారు) స్నేహపూర్వకముగా చూడాలి. ఎందుకంటే, వారు ఆస్తికులు సరిచేసుకోవలసిన పొరపాట్లను అన్వేషించి చూపి ఆస్తికులను నిందిస్తూ ఉంటారు. ఉదాహరణకు నాస్తికులు మహిమలను ఇంద్రజాలము అని విమర్శిస్తారు. మోసపూరిత ప్రబోధములు చేయువారు, ఇంద్రజాల ప్రదర్శనలను చేసి వాటినే అద్భుతమైన మహిమల పేరుతో జనులను నమ్మించే వారు ఉన్నారనే విషయమును కాదనలేము. అయితే అలాంటి ఇంద్రజాలములను చూపే మోసపూరిత గురువులను చూపి, నాస్తికుడు యథార్థమైన మహిమలను మరియు అటువంటి యథార్థమైన మహిమలు చేసెడి సత్యమైన దివ్యమైన గురువులను కూడా మోసపూరితులని

సిద్ధాంతీకరించరాదు. కావున 1. నాస్తికుడు, ధర్మబద్ధమైన జీవనము గడిపే వాడు, విశిష్టుడు (ఇటువంటి నాస్తికులకు కూడా భగవంతుని దయచేత స్వర్గలోకము అనుగ్రహింపబడుతుంది). మరియు 2. విజ్ఞాన శాస్త్ర నాస్తికులు, దృష్టాంతములను చూసి యథార్థమైన మహిమలను తర్కబద్ధముగా వివరించలేని అశక్తత కారణముగా మౌనము వహించిన వారు - వీరిద్దరూ ఆధ్యాత్మిక ప్రయాణమునకు అర్హత గల వారు. కేవలము తర్కసంగత విశ్లేషణ చేయనివాడు, అశాస్త్రీయమైన పిడివాదన చేసే నాస్తికుడు మాత్రము ఆధ్యాత్మిక ప్రయాణము అనెడి యోగమునకు అనర్హుడు, కావున నిందింప తగినవాడు.]

**నిందితో గీయతే చాన్యః, ప్రథమో ఒర్థార్థ తర్కతః |**
**ఇయం పంచ దశాస్వాద్యా, శిష్టా గీతాః క్రమేణ తాః || 17.5||**

[భగవద్గీత యందు భగవంతుని చేత నిందింప బడిన నాస్తికులు, తమ స్థానము నుండి కదలని మూఢులైన (**నాన్యదస్తీతి వాదినః, ఆసురీష్వేవ యోనిషు** - గీత) నాస్తికులని గ్రహించాలి. యోగమార్గములో మొట్టమొదట దశ ఏదంటే, ధర్మబద్ధమైన నాస్తికులను మరియు శాస్త్రవేత్తలైన నాస్తికులను గనక మనము 50:50 సంభావ్యత (భగవంతుని నివాసమును మేము చూపలేకపోతున్నాము, అనిర్ణీతమైన విశ్వపరిధి లోపల స్వర్గనరకములను కూడా మేము చూపలేకపోతున్నాము, కాని నాలాగే నీవు కూడా ఈ మూడు లేవని చూపలేకపోతున్నావు (అనగా, నన్ను ఈ అనంతమైన విశ్వమంతయును తిప్పి స్వర్గ నరకములు లేవని నీవు కూడా నాకు చూపలేకపోతున్నావు). తుది ఫలితము ఏమిటంటే ఈ మూడింటి విషయములో సత్యమైన సంభావ్యత 50:50 అని తేలింది (అనగా, స్వర్గనరకములు ఉండవచ్చును లేకపోవచ్చును). నరకము ఉందని అంగీకరించి, పాపకర్మలు చేయకపోవుటము అనేది తక్కువ ప్రమాదకరమైన వికల్పము అవుతుంది. ఒకవేళ నరకము లేకున్నా, ఒకనికి పాపకర్మలు చేయకపోతే వచ్చే భయము ఏదీ లేదు. కాని నాస్తికుడు నరకము

లేదని నమ్మి ఒకవేళ పాపకర్మలు చేస్తే, చివరకు నరకము ఉంటే తను పూర్తిగా నాశనమవుతాడు. మొదటి సంభావ్యత వారిలో లాభము కూడా ఉన్నది. ఆస్తికులు, చేసిన పాపములకు నేరవిచారణలు తదితర ఒడిదుడుకులు ఏవీ లేకుండా జీవితములో పూర్తి శాంతితో , ఆరోగ్యముతో ఆనందముగా ఉండగలరు. రెండవ సంభావ్యత వారిలో ఉన్న అదనపు నష్టమేమిటంటే, నాస్తికులు చేసిన పాపములకు జరుగబోయే నేరవిచారణను తలచుకుని భయపడుతూ, నిరంతరమూ ఎంతో మానసిక వ్యాకులతతో ఉంటారు.) ధర్మబద్ధమైన నాస్తికులు మరియు శాస్త్రవేత్తలైన నాస్తికులలో, 50:50 సంభావ్యత అనెడి తర్కముతో సులభముగా మార్పుతేవడమే ఆధ్యాత్మిక ప్రయాణములో మొదటి దశ. మిగిలిన నాలుగు దశలు భగవద్గీతలో వివరించినట్లు, అభ్యాస, జ్ఞాన, ధ్యాన మరియు కర్మ ఫలత్యాగములు. (**శ్రేయో హి జ్ఞానమభ్యాసాత్**...గీత) ఆధ్యాత్మిక ప్రయాణమును నిర్ణయించును.]

**ఆద్య స్సకామ కర్మైవ, దేవతా ఈశ్వరోఽథ వా |**
**దేవేష్వీశే చ సో ఽభ్యాసః, పూర్వా దేవేషు కేవలమ్ || 17.6||**

[నాలుగు దశలలో మొదటిది అభ్యాసము అంటే ప్రాపంచిక కోరికల తీర్చుకునే నిమిత్తము భగవంతుని ఆరాధించడము. ఒక్క విషయమును మినహాయించి ఇది పూర్వమీమాంసతో పూర్తిగా ఏకీభవిస్తుంది. పూర్వమీమాంసలో దేవుళ్ళను విశ్వసిస్తారు, ఒకే దేవుడిని కాదు. కాని అభ్యాస దశలోని సాధకులు దేవుడు మరియు దేవుళ్ళు అనే రెండు విధానాలను విశ్వసిస్తారు. నిజమైన ప్రేమ ప్రాపంచిక కోరికల మీదనే కాని ఉత్కృష్టమైన పరమాత్మ మీద కాదు అనేది ఈ రెండు విధానాలలో ఉమ్మడిగా ఉన్న విషయము. కావున భగవంతుని మీద నిజమైన ప్రేమ లేనందున ఈ రెండు మార్గములు ఇంచుమించుగా సమానము అనవచ్చును, లేదా రెండూ ఒకటే అనవచ్చును. ఈ భక్తులు భగవంతుని మీద నిజమైన భక్తి లేని నాస్తికుల వంటి వారు. భేదం ఏమిటంటే,

నాస్తికులు భగవంతుడు లేడు అని అంటారు, అభ్యాస దశ లోని భక్తులు భగవంతుని విశ్వాసిస్తారు, ఇదే రెండింటి మధ్య గల బేధము. పూర్వమీమాంసకులకు భగవంతుని మీద విశ్వాసము లేదనే అంశమును పెద్దగా పట్టించుకోనవసరము లేదు, ఎందుకంటే స్వప్రయోజనములకు ఉపయోగించుకోగల దేవతల అనూహ్య శక్తి మీద విశ్వాసము పూర్వమీమాంసకులకు ఉన్నది. అనూహ్యమైన శక్తి మీద ఇద్దరికీ విశ్వాసము ఉన్నది. ]

**అధమానాం దుష్ప్రవృత్తిః, ప్రవృత్తి రాస్తికా పరా |**
**అసత్త్వమైవ దైవే తత్, విషకుంభః పయోముఖః || 17.7||**

[ అధమ నాస్తికుడు, 50:50 సంభావ్యతను వివరించిన మీదట కూడా మారకపోతే తప్పకుండా అతను పాపకర్మ చేసినవాడే. ఎందుకంటే చేసిన పాపకర్మలకు బలము చేకూర్చుకోవడము కోసము నాస్తికత్వము లోకి చేరతాడు. ఈ తరగతిని దుష్ప్రవృత్తి అంటారు. వేరే రెండు రకాలైన నాస్తికులు (ధర్మబద్ధమైన నాస్తికులు మరియు శాస్త్రవేత్తలైన నాస్తికులు), వారు ఆస్తికులుగా మారే అవకాశములు చాలా ఎక్కువ. ఆ రెండు రకాలైన నాస్తికులు (ధర్మబద్ధమైన నాస్తికులు మరియు శాస్త్రవేత్తలైన నాస్తికులు), నాస్తికత్వము నుండి ఆస్తికత్వమునకు మారితే వారు ప్రవృత్తి అనే తరగతిలో చేరినవారు అవుతారు. ప్రవృత్తి యొక్క ముఖ్య లక్షణము ఏమిటంటే ప్రవృత్తి స్థాయిలోని ఏ ఒక్క జీవాత్మకు భగవంతుని మీద యథార్థమైన ప్రేమ ఇసుమంత కూడా ఉండదు. ప్రవృత్తిని అనుసరించి అంతరంగములో, హృదయపు లోతుల్లో ప్రాపంచిక సమస్యల పరిష్కారము మీద మాత్రమే గాఢమైన ప్రేమ కలిగి ఉంటారు. భగవంతుని మీద వారు చూపించే ప్రేమ ఎప్పుడూ అసత్యమైనదే, విషపు కుండలో పైపైన పాలతో కప్పినట్లు, సత్యమైన వారి ప్రేమ ప్రాపంచిక బంధాల మీద మాత్రమే ఉంటుంది. ]

**వేదోక్తాః కామ్య యజ్ఞాశ్చ, దైవాధారా అనూహ్యగాః |**

## దైవావిశ్వాస పూర్వస్య, దేవతా అపి దైవవత్ ||17.8||

[వేదములలో కూడా ప్రాపంచిక ఫలితములు పొందటము కొరకు ఎన్నోరకాలైన యజ్ఞవిధానములు తెలుపబడినవి, అయితే ఆయా యజ్ఞఫలితములు ఇవ్వగల మూలకారణము మాత్రము దేవుని లేదా దేవుళ్ళ యొక్క అనూహ్యమైన శక్తి మాత్రమే. అనూహ్యమైన శక్తుల మీద గల ఈ విశ్వాసమే అనూహ్యమైన భగవంతునికి గల అనూహ్యమైన శక్తులను తెలియజేస్తుంది. పూర్వమీమాంస భగవంతుని విశ్వసించదు, కాని దేవుళ్ళకు గల అనూహ్య శక్తులను విశ్వసిస్తుంది. కావున నిజానికి అనూహ్యమైన శక్తుల మీద ఉన్న విశ్వాసమే అనూహ్యమైన భగవంతుడి మీద విశ్వాసముగా కనిపిస్తుంది. అంటే పూర్వమీమాంస ప్రత్యక్షముగా ఏకేశ్వరుని విశ్వసించక పోయినను పరోక్షంగా ముఖ్యమైన దైవశక్తిని విశ్వసిస్తుంది.]

## అధర్మద్వేష ధర్మేచ్ఛా, ప్రీత దైవాః ప్రవృత్తిగాః |
## నిరయస్వర్గ విస్రంభాః, కామ్యే దైవవిదః క్రమాత్ || 17.9||

[భగవంతుడు ధర్మమును ఇష్టపడతాడు, అధర్మమును ద్వేషిస్తాడు, కారణము అధర్మము ప్రపంచములో అలజడిని సృష్టిస్తుంది కాని ధర్మము శాంతిని స్థాపిస్తుంది. ఒక పారిశ్రామిక వేత్త తన పరిశ్రమను స్థాపించినట్లు భగవంతుడు ఈ సృష్టిని చేశాడు. ఏరకంగా పారిశ్రామిక వేత్త తన పరిశ్రమ ఎలాంటి అలజడులు లేకుండ శాంతియుతంగా నడవాలనుకుంటాడో అదే విధంగా భగవంతుడు తన సృష్టిని ఎలాంటి అలజడులు లేకుండ శాంతిమార్గంలోనే నడవాలనుకుంటాడు. భగవంతుడు ఏది ఇష్ట పడతాడో ఒక భక్తుడు ఎల్లప్పుడు అదే ఇష్ట పడతాడు, భగవంతుడు ద్వేషించు దానిని తాను కూడా ద్వేషిస్తాడు. కావున స్వార్ధ ఫలితాలను కోరే ప్రవృత్తిలోనున్న ప్రతి భక్తుడు కూడా భగవంతుడిని మంచి సంతోష స్థితిలో ఉంచడము కోసము పై సిద్ధాంతమును అనుసరిస్తూ ధర్మమును ఎంచుకుంటూ, అధర్మమును వ్యతిరేకిస్తాడు. ఈ విధంగా ప్రవృత్తిలోనున్న భక్తులు

భగవంతుడు సృష్టించిన స్వర్గలోక, నరకలోకములందు విశ్వాసము కలిగి ఉంటారు. పుణ్యకర్మలు చేస్తే బహుమతులు, పాపకర్మలు చేస్తే శిక్షలు అక్కడ అమలుపరచబడతాయని గట్టిగా నమ్ముతారు. ప్రవృత్తిలోనున్న భక్తులు తమ స్వార్థ ప్రయోజనాల కోసమే భగవదారాధన చేసినప్పటికి, వారి అంతిమ లక్ష్యము ఏమిటంటే సమీప భవిష్యత్తులో పరమోత్కృష్టమైన భగవంతుడిని పట్టుకొని, ఆయన కళ్యాణగుణములను అభిమానించి పరమదైవమునకు ఆకర్షితులై తుదకు చివరిస్థాయి అయిన నివృత్తి భక్తులుగా మారడమే.]

**తన్మూలం మోక్షసౌధస్య, సహతే స్వం న లౌకికమ్ |**
**దశాస్యో మౌళి దాతాఽపి, హతః ప్రహ్లాద వృత్తవత్ || 17.10||**

[నివృత్తి అనబడే భవనమునకు ప్రవృత్తి పునాది. ప్రవృత్తి అంటే ప్రాపంచిక జీవితము, నివృత్తి అంటే ఆధ్యాత్మిక జీవితము. ప్రవృత్తి పవిత్రముగా ఉంటే నివృత్తి కూడా దృఢమౌతుంది. ఒక జీవాత్మ తన తోటి జీవాత్మలతో మెలిగే విధానము ప్రవృత్తి అయితే నివృత్తి పరమాత్మతో జీవాత్మ అంతరంగములో నిర్మించుకున్న వ్యక్తిగత వ్యవహారము. దీనికి ప్రపంచముతో ఎలాంటి సంబంధము లేదు. ఒకవేళ నివృత్తిలోని భక్తుడు ఏ కారణము చేతనో భగవంతుని బాధిస్తే దానిని భగవంతుడు పట్టించుకోడు. కాని నివృత్తి లోనున్న ఒక భక్తుడు తన తోటి జీవాత్మలను బాధిస్తుంటే భగవంతుడు అతడు తన పతాకస్థాయి నివృత్తిలో ఉన్న భక్తుడు అని కూడా చూడక అతడిని ఏమాత్రం సహించడు. ఉదాహరణకు రావణుడు భగవదారాధనలో తన తలనే అర్పించగల భక్తిని పతాకస్థాయిలో ప్రదర్శించిన వాడు అయినా ప్రపంచమును హింసించు స్వభావి కాబట్టి, భగవంతుడు అతని భక్తిని పట్టించుకోక భక్తుడనే పక్షపాతము చూపక దండించెను. అలాగే రాక్షసరాజు హిరణ్యకశిపుడు విష్ణు భగవానుని ఎంతగానో దూషించాడు, భగవంతుడు అయిన విష్ణువు మౌనము దాల్చాడు. కాని అదే రాక్షసుడు, శ్రేష్ఠమైన భక్తుడగు ప్రహ్లాదుని

హింసించినపుడు, తక్షణమే దారుణంగా భగవంతుని చేత వధింపబడ్డాడు.]

**అబంధా ద్యజమానస్య, శ్రద్ధా దోష గుణేషు దృక్ |**
**మర్కటస్య శిశో ర్బంధః, నిరయస్వర్గ గామినః || 17.11||**

[ప్రవృత్తిలో భగవంతుని మీద యథార్థమైన ప్రేమ లేని కారణముగా, భగవంతునితో వ్యక్తిగత బంధము ఉండదు, కావున భక్తుడు భగవంతుని పట్టుకునే పట్టులో చాలా జాగ్రత్త వహించాలి. ఇది పిల్ల కోతి తన తల్లి కోతిని పట్టుకునే విధానము వంటిది. ఇక్కడ పట్టుకు సంబంధించిన బాధ్యత అంతా పిల్లదే కాని తల్లిది కాదు. ఒకవేళ భక్తుడు పుణ్యకర్మలు చేస్తే అతని ఫలితము ఉన్నంత వరకు స్వర్గలోకము ఇవ్వబడుతుంది. ఒకవేళ భక్తుడు పాపకర్మలు చేస్తే అతడు నరకానికి పంపబడి, అతనికి భవిష్యత్ లో పాపకర్మ చేయాలంటే మనసులో కొంత భయము కలిగే స్థాయికి చేరే వరకు అక్కడ శిక్షించబడతాడు. ఈ వ్యవస్థను ఇలా ఉదాహరించ వచ్చును, ఒక కార్యాలయంలో ఉద్యోగి తన యజమానితో ఎలాంటి బంధము లేకుండ పనిచేస్తాడు, ఉద్యోగి చేసే పనిలో చూపే గుణాలు మరియు దోషాలే అతడు పొందబోయే పదోన్నతులు లేదా పదాధమగతులకు కారణము అయ్యే వ్యవస్థ ఇలాంటిదే.]

**ప్రవృత్తేః పరమధ్యాత్మ, నివృత్తిః జ్ఞాన మాదిమమ్ |**
**గురోః పూర్ణ సతి జ్ఞానే, భక్తి కర్మ సునిశ్చితమ్ || 17.12||**

[ఇలా మొదటి దశ అయిన ప్రవృత్తి లేదా అభ్యాసము తర్వాత, ఆధ్యాత్మిక జ్ఞానమును నేర్చుకొనే జ్ఞాన యోగమనే రెండవ దశ మొదలౌతుంది. ఈ దశలో ఆధ్యాత్మిక ప్రబోధకుని బాధ్యత చాలా కీలకము. ఎందుకంటే అతను ఆధ్యాత్మిక జ్ఞానమును బోధించాలి, అది సత్యమైనది మరియు సంపూర్ణమైనది అయి ఉండాలి. ఒకవేళ సంపూర్ణ ఆధ్యాత్మిక జ్ఞానమును పొందినట్లైతే ఇక సంశయాలు ఉండవు. ఆధ్యాత్మిక జ్ఞానము సంపూర్ణము లేదా సత్యము కాకపోతే దానిని అమలు చేయలేరు. సత్యమైన, సంపూర్ణమైన ఆధ్యాత్మిక

జ్ఞానము ఆకస్మికముగా ప్రేరణయగు, భక్తిని కలిగించడము (మూడవ దశ) ద్వారా జ్ఞానము యొక్క ప్రత్యక్ష సాధన లేదా కర్మయోగమునకు (నాలుగవ దశ) దారి తీస్తుంది.]

**క్రమో జ్ఞాన భక్తి కర్మ, గీతాయాం విపరీతవాక్ |**
**క్రమోయం త్రిగురు ప్రాప్తేః, ప్రత్యేకాధ్యాయగం త్రయమ్ || 17.13||**

[జ్ఞానము ప్రేరణయగు భక్తిని జనింపజేస్తుంది. ఈ ప్రేరణ జ్ఞానమును ఆచరణాత్మక సాధనగా మారుస్తుంది. ఇదే సరైన క్రమము. ఆదిశంకరాచార్యులు జ్ఞానము కొరకు, రామానుజాచార్యులు ప్రేరణ లేదా భావరూప భక్తి మరియు మధ్వాచార్యులు ప్రత్యక్ష సాధన యగు కర్మయోగము కోసము ఆధ్యాత్మిక మార్గ బోధను చేసేందుకు ఈ క్రమములోనే వచ్చారు. భగవద్గీతలో మొదటి ఆరు ఆధ్యాయాలు ప్రత్యక్ష సేవను, రెండవ ఆరు అధ్యాయాలు ప్రేరణ లేదా భక్తిని తర్వాత చివరి ఆరు అధ్యాయాలు జ్ఞానమును బోధిస్తాయని కొందరు అంటారు. ఇటువంటి ఏర్పాటు కొంతమంది ద్వారానే జరిగినది. అంతే తప్ప ఈ ఏర్పాటు శ్రీకృష్ణుని చేత గాని ఋషి అయిన వ్యాసుని చేత గాని జరుగలేదు. భగవద్గీత లోని ప్రతి అధ్యాయములోను జ్ఞాన, భక్తి, కర్మయోగములు మూడు వరుసగా రావడము నీవు గమనిస్తావు. ఈ విధంగా భగవద్గీతలోని ప్రతి ఒక్క అధ్యాయము కూడా సంపూర్ణముగా ఒక సంక్షిప్త భగవద్గీతయే.]

**జ్ఞానాంబు భక్తి పాంసుభ్యాం, ఫలమంకురగం క్రమాత్ |**
**కర్మైవ జ్ఞాన భక్తిభ్యాం, ఫలితం త్యాగ దాస్యవత్ || 17.14||**

[ మొక్క నీరు మరియు ఎరువుల సహాయంతో పెరిగి వృక్షమై ఫలములను ఇస్తుంది. అలాగే సాధనయగు కర్మయోగము కూడా జ్ఞానము భక్తి సహాయముతో పెరిగినపుడు మాత్రమే దివ్యమైన ఆధ్యాత్మిక ఫలములను ఇస్తుంది. భావరూపములైన జ్ఞానము మరియు భక్తి తమంతటతామే ప్రత్యక్షముగా ఏ ఫలితాలనూ

ఇవ్వలేవు. చివరిదైన సాధనయగు కర్మయోగము రెండు విధములు. 1. కర్మఫలత్యాగము, అంటే పనికి లభించిన ప్రతిఫలమును త్యాగము చేయుట 2. కర్మ సన్యాసము లేదా సేవను సమర్పించుట.]

**క్రమో జ్ఞాన భక్తి కర్మ, దశానాం పురదర్శనే |**
**రుక్మిణ్యాః కృష్ణ లాభే చ, దృష్టాంతాభ్యాం విమృశ్యతామ్ || 17.15||**

[ముంబయి నగరము గురించి నీవు విన్నప్పుడు అది జ్ఞాన యోగము లేదా తెలుసుకోవడము అవుతుంది. ఇది మొదటి మెట్టు. దీని తర్వాత నీవు ముంబయి నగరమునకు వెళ్ళాలని, చూడాలని ప్రేరణ పెంచుకుంటావు, ఇది భక్తియోగము అనబడే రెండవ మెట్టు. అప్పుడు నీవు రైల్వేస్టేషన్ కు నడుస్తావు, ఇది కర్మ సంన్యాసము. చివరగా నీవు ముంబయికి టికెట్ కొంటావు అది కర్మ ఫలత్యాగము. కర్మ సంన్యాసము మరియు కర్మ ఫల త్యాగములను కలిపి మూడవ మెట్టు అగు కర్మయోగము. దీనికి ఇంకొక ఉదాహరణ రుక్మిణి, తాను నారద( నారద అంటే జ్ఞానమును ఇచ్చువాడు అనే అర్ధము ఉన్నది). నారద ఋషి ద్వార శ్రీకృష్ణుని గురించిన వివరములు రుక్మిణి తెలుసుకున్నది. ఇదే జ్ఞానయోగము. దీని తర్వాత రుక్మిణి కృష్ణుని పట్ల ఉద్వేగభరితమైన ప్రేమ పెంచుకున్నది, ఇదే భక్తియోగము లేదా భక్తి. భక్తి చేత ప్రేరణ పొందిన రుక్మిణి వ్రాసిన ప్రేమలేఖతో ఒక పురోహితుని శ్రీకృష్ణుని వద్దకు పంపినది. ఇది కర్మ సంన్యాసము. పురోహితుడు శుభవార్తతో తిరిగి వచ్చినప్పుడు అతనికి తన బంగారు గొలుసు కానుకగా ఇచ్చినది, ఇది కర్మ ఫలత్యాగము. కావున జ్ఞానము, భక్తి మరియు ప్రత్యక్ష సాధనయగు కర్మయోగము (సేవ + సమర్పణము) అనేది ఆధ్యాత్మికత యందు సరియైన వరుసక్రమము. గీతయందు చెప్పబడిన శ్లోకము ప్రకారము (*శ్రేయో హి..*) జ్ఞానము అనేది రెండవ దశ, భావరూప భక్తి అనేది మూడవ దశ, మరియు ప్రత్యక్ష సాధన అగు కర్మయోగము నాలుగవ దశ. నాస్తికులని ఆస్తికులుగా మార్చడము అనేది ఆరంభ

దశ. అభ్యాసము లేదా ప్రవృత్తి అనేది మొదటి దశ. రెండు (జ్ఞానము) మూడు (ధ్యానము లేదా భక్తి) మరియు నాలుగవ (కర్మ ఫల త్యాగము అనగా కర్మ యోగము) దశలు నివృత్తిని మార్గమును నిర్మిస్తాయి.
**ప్రత్యేక వివరణ**: - కర్మ ఫల త్యాగము కర్మ యోగముగా ఈ గీతా శ్లోకములో చెప్పబడుచున్నది. దీని అర్థమేమి? అంటే, సంన్యాసులు జేయు కర్మ సంన్యాసమును లెక్క జేయనట్లేనా? దీనికి సమాధానము: - గృహస్థులు కర్మ ఫల త్యాగము మరియు కర్మ సంన్యాసమును చేయవలెను. సంన్యాసులు కేవలము కర్మ సంన్యసమును మాత్రమే చేస్తారు. కావున, కర్మ సంన్యాసమును చెప్పినచో కర్మ ఫల త్యాగము దానివెంట తప్పనిసరిగా రాదు. కర్మ ఫల త్యాగమును చెప్పినచో దానివెంట కర్మ సంన్యాసము తప్పనిసరిగా వచ్చును. ఇందువలన, కర్మ ఫల త్యాగ శబ్దమునకు కర్మ యోగము (కర్మఫల త్యాగము + కర్మ సంన్యాసము) అను అర్థమును చెప్పవచ్చును. కర్మ సంన్యాస శబ్దమునకు కర్మ యోగము అను అర్థమును చెప్పుటకు వీలు కాదు.]

**బ్రహ్మలోకశ్చ గోలోకః, ఫలే ఛాద్వైతి భక్తయోః |**
**ఫలాశా తు ప్రవృత్తిస్థా, నివృత్తిః ఫల వర్జితా || 17.16||**

[ ఏడవ ఊర్ధ్వ లోకము 'బ్రహ్మ లోకము' లేదా భగవంతుని నిలయము మరియు అంతకు పైన ఎనమిదవ లోకము 'గోలోకము' లేదా అత్యున్నతమైన ఫలము. ఇందులో భగవంతుడే స్వయముగా భక్తుల సేవకుడు అవుతాడు. ఈ విధంగా భక్తుడు రెండు ఫలములను పొందుతాడు. ఇదే యోగమార్గములో చివరి మెట్టు. మొదటి ఫలితము, అద్వైత సిద్ధాంతము, అంటే హనుమంతుని అవతారము వలె జీవాత్మయే దైవము అవుతాడు. తానే భవిష్యత్ బ్రహ్మ. అంటే బ్రహ్మ భవిష్యత్ లో హనుమంతునిలో విలీనము అవుతాడు. రెండవ ఫలము ద్వైత సిద్ధాంతము. ఇందులో జీవాత్మ భగవంతునికి యజమాని అవుతాడు, గోలోకములో గోపికల వలె జీవాత్మలు భగవంతుని కంటే వేరుగా

ఉంటారు. ప్రవృత్తిలో (అభ్యాసము అనబడే మొదటి దశ ), ప్రాపంచిక ఫలితముల మీద కోరిక ఉంటుంది. అదే నివృత్తిలో (రెండు, మూడు మరియు నాలుగు దశలు) అయితే ఏ ఫలితాల మీద కోరిక ఉండదు, ఎందుకంటే నివృత్తిలో భక్తి అనేది కేవలము భగవంతుని పట్ల ఆకర్షణ కారణముగా ఏర్పడుతుంది కాని ఇతర ఆకర్షణల వలన కాదు.]

**యోగ మార్గే మహా సర్పో, భక్తేః ప్రతిఫలేప్సితమ్ |**
**మహా నిశ్రేణికా తస్యాః, తద్వినా ఽఽకర్షణం పరే || 17.17||**

[భగవంతుని చేరే యోగ మార్గములో, భక్తుడు భగవంతుని పై పెంచుకున్న భక్తికి ప్రతిగా ఏదైనా ఫలమును కోరుకోవడము ఎలాంటిది అంటే పరమపద సోపానపటములో అతి పెద్ద సర్పము మ్రింగి క్రింద పడటము వంటిది. ఊర్ధ్వ ప్రగతిని కలిగించే అత్యంత పొడవాటి నిచ్చెనయేమిటంటే, తిరిగి భగవంతుడి నుండి ఏమీ కోరకుండా, కేవలము భగవంతుని కళ్యాణగుణముల పట్ల దృఢమైన ఆకర్షణ, ప్రేమను కలిగి ఉండటము.]

**నిశ్రేణికా గుణా స్సర్వే, సత్కర్మాణి షడాననైః |**
**తే హ్యేవ దుర్ముఖై స్సర్పాః, దుష్కర్మాణి వివేకినామ్ || 17.18||**

[ ఒకవేళ వాటి మంచి ముఖముల వైపు త్రిప్పితే, అన్ని గుణములు మంచి ఫలితాలనే ఇస్తాయి. అవే గుణములను వాటి చెడుముఖముల వైపు త్రిప్పితే చెడఫలితాలను ఇస్తాయి. కావున ప్రతి గుణముకూడా మంచిముఖము వైపు తిప్పడము చేతనే మంచి ఫలితములను ఇస్తుంది, అలాగే ప్రతి గుణము చెడ్డముఖము వైపు తిప్పినపుడే చెడ్డ ఫలితములను ఇస్తున్నది. కావున ఈ మార్గములో మంచి క్రియలు అనేవి పైకి తీసుకెళ్ళే నిచ్చెనలు, చెడ్డ క్రియలు అంటే క్రిందకు తోసివేసే పాములు.

జ్ఞానులైన సాధకులు ఆయా గుణముల చెడు లేదా మంచి ముఖముల ఆధారముగా పాములేవో, నిచ్చెనలేవో నిర్ణయించగలరు.]

**పాపీ చ నాస్తికో భూయాత్, గోపికా హనుమానపి |**
**నరావతార వద్యోగే, ద్వైతాద్వైత ఫలాద్వయే || 17.19||**

[ ఇక్కడ వర్ణించిన యోగమార్గము సున్న నుండి +100 వరకు కాకుండా, చాలా క్రింద నుండి అంటే -100 నుండి +100 వరకు తెలుపబడినది. ఆరంభములో నాస్తికుడు పాపకర్మలు చేస్తుంటాడు. ఆధ్యాత్మిక మార్గములో నడచి చివరిలో చేరుకోగల గమ్యము అత్యున్నతమైన గోపికల గోలోకము లేదా హనుమంతుని వలె మోక్షము పొందిన జీవాత్మలు పొందెడి గోలోకము క్రింద గల బ్రహ్మలోకము. గోపికలు ద్వైతము అను ఫలితములో ఉన్నారు, హనుమంతుడు భక్తిఫలముగా అద్వైతము పొందారు. కావున యోగమార్గము ఎప్పుడైనా వర్తమాన నరావతారమైన భగవంతుడినే లక్ష్యముగా కలిగి ఉంటుంది. ఏలననగా, గోపికలు మరియు హనుమంతుడు వర్తమాన నరావతారములైన కృష్ణుడు మరియు రాముడిని ఉపాసించినారు. ]

**గోలోక బ్రహ్మ లోకౌ తౌ, బద్ధా బద్ధ గతౌ ఫలే |**
**అబద్ధ మోక్షా దధికో, బద్ధ మోక్షో మహత్తరః || 17.20||**

[ఏ ప్రాపంచిక బంధాలు లేనటువంటి హనుమంతుని వంటి భక్తులు బ్రహ్మలోకమును చేరుకుంటారు. అనేక బలమైన ప్రాపంచిక బంధాలు గల గోపికల వంటి వారు గోలోకము చేరతారు. ప్రాపంచిక బంధాలు బలముగా ఉన్న వారు మోక్షము పొందడము అనేది ప్రాపంచిక బంధాలు లేనివారు మోక్షము పొందడము కంటే చాలా కఠినమైనది. అందుకే గోపికలకు బ్రహ్మ లోకము కంటే ఎక్కువ ఫలితము ఇవ్వబడినది. కాబట్టి బలమైన ప్రాపంచిక బంధములు గల వారు మోక్షమార్గము గురించి నిరుత్సాహ పడరాదు. ఎందుకంటే వారికి అత్యున్నతమైన దానికంటే

అత్యున్నతమైన ఫలితమే లభిస్తుంది. ఇదెలా సాధ్యమవుతుందంటే, భగవంతుని యందు బలమైన ఆకర్షణ లేదా భక్తితో చాలా సహజముగా, తత్ క్షణమే ఆకస్మికముగా ప్రాపంచిక బంధాల నుండి విముక్తి పొందడములో విజయము సాధిస్తారు. ప్రాపంచిక బంధములు లేనపుడు భగవంతునిపై బంధము బలమైన ఆకర్షణముతో ఉండనవసరము లేదు. కానీ, ప్రాపంచిక బంధములు బలముగా ఉన్నపుడు భగవంతునిపై బంధము చాలా చాలా బలమైన ఆకర్షణతో ఉండవలసి వచ్చును, అప్పుడే, ప్రాపంచిక బంధములు తెగిపోవును. ఇందువలన, మొదటి ఉదాహరణ కన్నా, రెండవ ఉదాహరణలో అత్యున్నతమైన ఫలము లభించినది. అనగా, హనుమంతుడు పొందిన అత్యున్నత బ్రహ్మలోకము కన్నా, అధికమైన గోలోకమును గోపికలు పొందినారు.]

**ఇతి త్రైలోక్యగీతాయాం 'యోగమార్గ జ్ఞాన యోగో' నామ సప్తదశాధ్యాయః**
**ఈ విధంగా త్రైలోక్యగీత యందు పదిహేడవ అధ్యాయము అయిన 'యోగమార్గ జ్ఞానయోగము' పరిసమాప్తము.**